క్లుప్తంగా

భవిత సేవల పరిశీలన



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ

పెద్దాపురం: భవిత సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వీఆర్‌కే చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న సేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యా శాఖ ద్వారా విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థికి అందిస్తున్న ఫిజియో థెరపీని, రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, ఆనందరావు, పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

30న సువార్త స్వస్థత సభ

పెద్దాపురం: మండలంలోని తిరుపతి సీజీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు సువార్త స్వస్థత సభ నిర్వహించనున్నట్లు సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా చెన్నైకు చెందిన రెవరెండ్ సుందర్‌రాజ్, వనితి సుందర్‌రాజ్‌లు దైవ ప్రసంగం అందించగా చైన్నై ప్రముఖ సువార్త గాయకులు సీహెచ్.రమేష్ బాబుచే మధురమైన గీతాలాప ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సువార్త స్వస్థత సభలో పాల్గొని దేవుని దీవెనలు పొందాలని సుదీప్ కోరారు. ఈ సమావేశంలో పాస్టర్ నంగిన సత్యానందం, కాసా అభిషేక్, వంకా జాన్ తదితరులున్నారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత జరిగే సమావేశంలో పట్టణంలోని అభివృద్ధి పనులకు సంబంధించి 16 అంశాలతో అజెండాను తయారు చేయడం జరిగిందన్నారు. అజెండాలోని అంశాలపై చర్చించడానికి పాలక మండలి సభ్యులు, ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

మాదిగ దండోరా నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకొంటున్న మాదిగ దండోరా నాయకులు

పిఠాపురం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో పిఠాపురంలో మాదిగ దండోరా నాయకులు సంబరాలు నిర్వహించారు. డప్పులు కొట్టి ఆనందం వ్యక్తం చేసిన మాదిగ దండోరా నాయకులు రిక్షా కార్మికులు, డప్పు కళాకారులు, ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన పోరాటాలు ప్రజా సంక్షేమం కోసం చేసిన ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాదిగ దండోరా నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి ఘన సన్మానం



కామేశ్వరరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న ఎంఎస్ కామేశ్వరరావును కళాశాల సిబ్బంది మంగళవారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సి.జయ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో ×సిగ్మా టు రివర్స్ డెరివేటివ్స్ ఇన్ రింగ్స్ అనే అంశంపై పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కామేశ్వరరావును ప్రిన్సిపాల్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మరిన్ని పరిశోధనలు చేసి మరిన్ని పట్టాలు, అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు పురులియా చౌ నృత్య రూపకం

పిఠాపురం: పశ్చిమ బెంగాల్‌లో ప్రసిద్ధి చెందిన పురులియా చౌ నృత్య రూపకాన్ని బుధవారం పిఠాపురంలో ప్రదర్శించనున్నట్లు సంగమేశ్వర సంగీత సమాఖ్య సభ్యులు తెలిపారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో ఈ నృత్య రూపకం ప్రదర్శిస్తున్నట్లు వారు తెలిపారు. 98 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి పేరొందిన ఈ నృత్య రూపకాన్ని వీక్షించాలని వారు కోరారు.

పింఛన్ పీకేస్తారేమో..!

- నకిలీల పేరుతో ఏరివేతకు కుట్ర
- భయం గుప్పెట్లో లబ్ధిదారులు
- నియోజకవర్గంలో రూ.15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు 53



కొమరగిరిలో మంచానికే పరిమితమైన వారి వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడే దివ్యాంగుల్లో పింఛన్ పెరిగిందన్న సంతోషం ఆరు నెలల్లోనే ఆవిరైంది. కూటమి ప్రభుత్వం అక్రమ పింఛన్ల పేరుతో అసలుకే ఎసరు పెడుతున్న వైనాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పింఛన్ల తొలగింపునకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు లబ్ధిదారుల గుండెల్లో గుబుల పుట్టిస్తున్నాయి. పింఛన్ల పరిశీలనలో భాగంగా మొదటి విడతలో వివిధ రుగ్మతలతో మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వైద్య నిపుణులు వస్తున్నారు. సదరు పింఛను సక్రమమేనా అనే దిశగా విచారిస్తున్నారు. దీంతో వచ్చిన అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తారా లేక కిరికిరి పెట్టి తొలగిస్తారా అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో దఫాలో వచ్చే నెలలో దివ్యాంగులుగా నిర్ధారణ ధ్రువపత్రాలతో రూ.6 వేలు పొందుతున్న పింఛన్‌దారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు ఇచ్చే నోటీసు ప్రకారం ఆయా తేదీల్లో సంబంధిత ఆసుపత్రిలో పరీక్షలు చేయిస్తామని కుటమి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దివ్యాంగ పింఛనుదారుల్లో కూడా ఆందోళనలు నెలకొన్నాయి.

నియోజకవర్గంలో..

పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి, గొల్లప్రోలు, గొల్లప్రోలు అర్బన్, పిఠాపురం, పిఠాపురం అర్బన్‌లో వివిధ రుగ్మతలతో మంచానికే పరిమితమైన పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వైద్య నిపుణులు పరీక్షలు చేస్తున్నారు. దివ్యాంగులకు వచ్చే నెలలో ఆయా ఆసుపత్రుల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు తిరిగి చేయనున్నారు. మంచానికి పరిమితమై రూ.15 వేలు పింఛన్ తీసుకుటున్న పింఛన్‌దారులు నియోజకవర్గంలో 53 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పింఛను లబ్ధిదారుల వివరాలిలా..

మండలం	రూ.15 వేల పెన్షనర్లు
కొత్తపల్లి	25
గొల్లప్రోలు	11
గొల్లప్రోలు అర్బన్	3
పిఠాపురం	11
పిఠాపురం అర్బన్	3

పింఛన్లు తొలగించేందుకే..



కూటమి ప్రభుత్వం దురుద్దేశంతో పింఛన్ల పరిశీలన కుట్రకు తెరతీసింది. రూ.15 వేలు పింఛన్‌దారులను కుదించేందుకు దుర్మార్గానికి తెరతీసింది. రెండో దఫా దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించేందుకు పన్నాగం పన్నింది. పింఛను మొత్తాన్ని పెంచడం ఎందుకు, తిరిగి కుదించేందుకు కుట్రలు ఎందుకు? నిర్ధారణకు వచ్చే వైద్యులపై కూడా ఒత్తిడి చేసే పరిస్థితులు నెలకొన్నాయి.

– ఆనాల సుదర్శన్
వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కొత్తపల్లి

ఉద్యాన పంటల సాగులో మెళకువలు



ఆయిల్‌పామ్ సమీకృత సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దాపురం: ఉద్యాన పంట సాగులో మెళకువలు, నూతన పద్ధతులు పాటించాలని పార్వతీపురం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ రాజేశ్వరి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో మంగళవారం కళాశాలలో బీఎస్సీ హార్టికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన శాఖాధికారులతో కలిసి రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఉద్యాన పనుల్లో నమూనా ప్రదర్శన, ఆయిల్ పామ్ అంతర్ పంటల సాగు, వివిధ రకాల మల్చింగ్, సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సేంద్రియ సాగుపై నాటక ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత, సర్పంచ్ దిమ్మల పుష్ప రత్నం, వ్యవసాయ సహాయకులు విజయదుర్గ, రైతులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ విజయకుమారి

- ఐసీడీఎస్ పీడీ విజయకుమారి
- వివిధ శాఖల సిబ్బందికి శిక్షణ

సామర్లకోట: బాలల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి కె.విజయకుమారి అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో కిశోర వికాసంపై మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్, విద్య, సచివాలయ కార్యదర్శులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన వారు కిశోర వికాసం ద్వారా వార్డు స్థాయిలో గ్రూపులు ఏర్పాటు చేసి బాలల చట్టాలు, పరిరక్షణ అంశాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సి ఉన్నదన్నారు. ఇదే సమయంలో బాల్య వివాహాలపై అవగాహన పెంచాల్సిన బాధ్యత ఉన్నదని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మాట్లాడుతూ ప్రభుత్వం బాలికలకు కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. బాలికలు చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ఈ తరుణంలో తల్లిదండ్రులు మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలని సూచించారు. సీడీపీఓ జి.ఉష మాట్లాడుతూ నేటి సమాజంలో మార్పు కోసమే ప్రతి ప్రాంతంలోను ప్రజలకు అందుబాటులో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బాలలపై వేధింపులు ఎక్కువ అవుతున్నారని, బాలలను కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యుక్త వయసులో రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యం, జీవనోపాధిపై గ్రామ స్థాయిలో బాల బాలికలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు 11 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన బాలికలను రెండు గ్రూపులుగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సీహెచ్ వెంకట్రావు, అనేక అంశాలను వివరించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, హెల్త్‌లైన్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహమ్మద్ సుల్తాన్ బీబీ, మంగ, నిర్మలాకుమారి, జి.వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పట్టుతప్పితే ప్రమాదం చిన్నా..



ఫుట్‌పాత్‌పై వేలాడుతూ వెళ్తున్న విద్యార్థులు

సామర్లకోట: బస్సులలో విద్యార్థులు నిత్యం వేలాడుతూ ప్రయాణిస్తూనే ఉన్నారు. బస్సుల ఫుట్‌బోర్డులపై వేలాడుతూ వెళ్తున్నవారి చేతులు పట్టు తప్పితే పరిస్థితి ఏమిటన్నది వారికి అర్థం కావడం లేదు. అటు రవాణా శాఖ అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ ఇటువంటి పరిస్థితిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని తోటి ప్రయాణికులు, స్థానికులు అంటున్నారు. బస్సు గోతులలో పడిన సమయంలో అదుపు తప్పి కింద పడి పాయే ప్రమాదం ఉంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో రహదారులు రద్దీగా ఉంటాయి. దాంతో కింద పడితే వెనుక నుంచి వచ్చే వాహనాల వారు కిందపడిన వారిని గమనించక పోతే ప్రమాదం ఏ స్థాయిలో ఉంటుందో విద్యార్థులు గమనించాలి. కాకినాడ–పెద్దిపాలెం బస్సుకు అనేక మంది విద్యార్థులు ప్రయాణిస్తూ ఉంటారు. దీని లో భాగంగా మంగళవారం సాయంత్రం ఈ బస్సులో విద్యార్థులు ఫుట్‌పాత్‌పై వేలాడుతూ ప్రయాణిస్తున్న చిత్రం సాక్షి కెమెరాకు చిక్కింది.

పెసా, అటవీ చట్టాలపై అవగాహన అవసరం



పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: గిరిజనుల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో ప్రత్యేకంగా పొందుపర్చిన పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డు ఏరియాస్ (పెసా), అటవీ హక్కుల చట్టంపై అవగాహన పెరగాలని విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామరాజు, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలోని 38 మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు రెండో బ్యాచ్‌లో నిర్వహించే శిక్షణను ఆయన మంగళవారం ఈటీసీలో ప్రారంభించారు.ఫిబ్రవరి 15 నుంచి శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోని అధికారులకు, గిరిజనులకు వారి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని పాడుచేశారనా పురస్కారం!

- మున్సిపల్ సమావేశంలో కమిషనర్‌ను నిలదీసిన కౌన్సిలర్లు
- పలు సమస్యలపై సమావేశంలో ప్రశ్నలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, కౌన్సిలర్లు

పిఠాపురం: పట్టణాన్ని కంపు కొట్టేలా చేసినందుకా మీకు ఉత్తమ అధికారిగా అవార్డు ఇచ్చింది అంటు కమిషనర్ కనకారావును పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో అన్ని వార్డుల కౌన్సిలర్లు సమస్యలను ఏకరుపెట్టారు. ఒక పక్క పత్రికలలో పిఠాపురంలోని సమస్యలను ఏకరవు పెడుతూ వార్తలు వస్తుంటే మరో పక్క వాటిని పట్టించుకోని కమిషనర్ కనకారావుకు ఉత్తమ అధికారిగా అవార్డులు ఇవ్వడం చూసి నవ్వొస్తుందన్నారు. పట్టణానికి ఏం చేశారని అవార్డు ఇచ్చారో ఉన్నతాధికారులు చెప్పాలని, తాము మాత్రం ఆయన ఏదీ పట్టించుకోరు కాబట్టి అవార్డు ఇచ్చారనుకుంటున్నామని ఎద్దేవా చేశారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, కనీసం రెండు రోజులకు ఒకసారి కూడా చెత్తను తీసుకువెళ్లే ట్రాక్టర్లు రావడం లేదని, ఎక్కడికక్కడ చెత్త గుట్టలు గుట్టలుగా పేరు పోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని కౌన్సిలర్లు ఏకరువుపెట్టారు. ఎక్కడికక్కడ మంచినీటి సరఫరా పైపులకు పగుళ్లు ఏర్పడి, డ్రైనేజీ నీళ్లు మున్సిపల్ కుళాయిల వెంబడి వస్తున్నాయని, ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని నిలదీశారు. అత్యంత కీలకమైన బడ్జెట్ సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టడంపై కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశానికి ఇలా ముఖ్యమైన శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నా కమిషనర్ పట్టించుకోడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు రాక పోతే మేము ఎవరిని అడగాలంటూ కమిషనర్‌ను నిలదీశారు. అధికారులు పని ఉండి వేరే ప్రాంతాలకు వెళ్లారని ఆయన చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు అతి ముఖ్యమైన బడ్జెట్ సమావేశం కంటే ముఖ్యమైన పని ఏముందో చెప్పాలని పట్టుబట్టారు. అధికారులు వచ్చే వరకు సమావేశాన్ని వాయిదా వేయాలని పట్టుబట్టారు. సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలెందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో నెలకొన్న అనేక సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా మళ్లీ మొదటికే వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 2024–25 సవరించిన బడ్జెట్, 2025–26 అంచనా బడ్జెట్‌ను కమిషనర్ కనకారావు సమావేశంలో ప్రవేశ పెట్టారు. వివిధ శాఖల ద్వారా అన్ని మార్గాల్లోను రూ.22,02,99,000 ఆదాయం, వివిధ పద్దుల ద్వారా రూ.20,80,48,000 వ్యయం అవుతుందని అంచనా వేశారు. తద్వారా రూ.1,20,50,000 మిగులు ఉంటుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. బడ్జెట్‌ను సమావేశంలో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉడకని వంటకాలతో వేడుక ఎలా?

- కుమారుడి జన్మదిన వేడుకలకు ఆర్డర్ ఇచ్చిన మెనూపై ఓ కుటుంబం ఆందోళన
- హోటల్ వద్ద ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో పరిస్థితి ప్రశాంతం



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని హోటల్ వద్ద బాధితులకు సంచుల్లో ఇచ్చిన ఆహారం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని ఒక ప్రైవేట్ హోటల్ వద్ద మంగళవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. తమ బిడ్డ పుట్టిన రోజు వేడుకలు సోమవారం సాయంత్రం సదరు హోటల్‌లో నిర్వహించేందుకు కాకినాడకు చెందిన ఒక కుటుంబం ఏపీఐఐసీ కాలనీలో సెవెన్ స్కా హోటల్‌తో ఒప్పందం కుదుర్చుకుని మెనూ ప్రకారం సొమ్ములు చెల్లించారు. కాగా మెనూ ప్రకారం ఫుడ్ ఇవ్వలేదని, మటన్ ఉడక లేదని, కల్తీ జరిగిందని అనుమానం వ్యక్తం చేసి నిరసన తెలియజేశారు. హోటల్ నిర్వహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మంగళవారం ఉదయమే సదరు కుటుంబం, బంధువులతో కలిసి వచ్చిన ఆందోళన చేసింది. విషయం తెలుసుకున్న సర్పవరం పోలీసులు ఆ కుటుంబానికి నచ్చజెప్పి, వారు ఆర్డరిచ్చిన ఫుడ్‌ను తమతో తీసుకువెళ్లారు.

దీనిపై ఏఎస్సై నాగేశ్వరరావును వివరణ కోరగా ఆందోళన సమాచారంతో తాము వెళ్ళామని, ఆహార పదార్థాల నాణ్యత, కల్తీ తదితర అంశాలు తమ పరిధిలోకి రావన్నారు. హోటల్ నుంచి తీసుకువచ్చిన ఫుడ్‌ను ఫుడ్ ఇనస్పెక్టర్ కార్యాలయానికి పంపామన్నారు.

ఈ విషయమై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా సెవెన్ స్కా హోటల్‌లో ఆహార కల్తీ జరిగింటే రాత్రి తినేటప్పుడే తమ దృష్టికి తీసుకురావాలి. ఆ విధంగా తమకు ఫిర్యాదు రాలేదన్నారు. ఉదయం సంచుల్లో ఆహారం ఉందన్నారు. సదరు హోటల్ సెంట్రల్ లైసెన్స్ కలిగి ఉందని, ఎమర్జెన్సీ సమయంలోనే తాము తనిఖీకి వెళ్లాల్సి ఉంటుందన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన యూనియన్ బ్యాంక్ మహిళా ఉద్యోగికి ఏడాది జైలు, రెండు లక్షల రూపాయలు పరిహారం విధిస్తూ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రసన్నలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారు తరఫు న్యాయవాది వసుధ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన పడాల శ్రీనివాసరెడ్డి వద్ద నుంచి రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న పోలోజు సత్యవాణి 2018లో రూ.ఐదు లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ అప్పు తీర్చడానికి 2021లో చెక్కు ఇచ్చారు. చెక్కు బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయ్యింది. దీనితో కోర్టులో దావా వేశారు. కోర్టు విచారణలో మహిళా బ్యాంక్ ఉద్యోగిపై నేరం రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీరు చెప్పారు.

మహిళ అదృశ్యం

తుని: రైలులో ప్రయాణిస్తూ మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జీ మోహన్‌రావు తెలిపారు. వివరాల్లోకెళితే.. సామర్లకోట భాస్కర్ కాలనీకి చెందిన గుర్ర నూకరత్నం(49) సంక్రాంతికి పాయకరావుపేటలో అమ్మగారి ఇంటికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో రత్నాచల్ ట్రైన్ ఎక్కి అదృశ్యమైంది. ఆమె ఆచూకీ దొరకకపోవడంతో నూకరత్నం తమ్ముడు పెద్దిరెడ్డి ఏసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ



గోదామును తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీఎస్‌ఓ ప్రసన్న లక్ష్మి

పిఠాపురం: గొల్లప్రోలు మార్కెట్ యార్డు వద్ద ఉన్న పౌర సరఫరాల శాఖ గోదామును మంగళవారం ఇన్‌చార్జి డీఎస్‌ఓ ప్రసన్న లక్ష్మి తనిఖీ చేశారు. ఆమె అధికారులతో కలిసి గోదాములో ఉండాల్సిన నిల్వ వివరాలు పరిశీలించారు. రికార్డులను పరిశీలించిన ఆమె ఎటువంటి తేడాలు లేకుండా నిత్యావసర సరుకులు సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దారు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఔరా.. నృత్యాలు అనుపమానం



మహిషాసుర మర్దిని ఘట్టంలోని సన్నివేశం

- పురులియా సంప్రదాయంలో మహిషాసుర మర్దిని, అభిమన్యు వధ రూపకాలు

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి గానసభల్లో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక జేఎన్‌టీయూకే అల్యూమినియం ఆడిటోరియంలో నిర్వహించిన పశ్చిమ బెంగాల్ వారి పురులియా చౌ సాంప్రదాయ జానపద నృత్య ప్రదర్శన నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. మహిషాసుర మర్దిని, అభిమన్యు వధ ఘట్టాలకు చక్కటి నృత్యం చేసి ప్రేక్షకులను మైమరపించారు. మహిషాసుర మర్దిని ఘట్టంలో దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసుడిని వధించి, మంచి, చెడులను జయించడం ఈ నృత్య రూపకంలో కళ్లకు కట్టినట్లు చూపారు. అభిమన్యు వధ ఘట్టంలో భారత యుద్ధంలో గొప్ప వీరుడైన అభిన్యుడు చక్రవ్యూహంలోకి వెళ్లడం మాత్రమే తల్లి కడుపులో ఉన్నప్పుడు తెలుసుకుని, దాని నుంచి బయటకు తప్పించుకుని బయటకు వచ్చే మార్గం తెలియక కౌరవ సైన్యంతో పోరాడిన ఘట్టాలు అద్భుతంగా ప్రదర్శించారు.

మత్స్యకారులకు అవగాహన

కాకినాడ క్రైం: వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కోస్ట్‌గార్డు కాకినాడ స్టేషన్ ఆధ్వర్యంలో కుంబాభిషేకం దేవాలయ ఆవరణలో మత్స్యకారులకు మంగళవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యకారులు వేట సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తీరం హద్దులు, భద్రతలో అనుసరించవలసిన పాత్రపై ఈ సదస్సులో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశాఖపట్టణం నుంచి చెన్నైకి ద్విచక్రవాహనాలపై ర్యాలీగా బయల్దేరిన ఈస్ట్రన్ కోస్ట్‌గార్డుకు చెందిన 34 మంది సిబ్బంది ప్రత్యేక అతిథులుగా హాజరై మత్స్యకారులతో మమేకమయ్యారు.